సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం। 24 । సెప్టెంబర్ । 2023



సేవలు ప్రత్యేకం..
భవిత కేంద్రాల్లో ప్రత్యేక సేవలు అందుతున్నాయి. మండలానికో కేంద్రం ఏర్పాటు చేశారు. - 8లో



కేసుల దర్యాప్తుపై దిశానిర్దేశం
కేసుల దర్యాప్తుపై ఎస్పీ రాధిక పోలీసులకు దిశానిర్దేశం చేశారు. పలు కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. - 8లో

జీవితం విలువ గుర్తించండి
ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు జీవితం విలువ గుర్తించాలని జిల్లా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.అనురాధ అన్నారు. చిలకపాలెం లోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం ర్యాగింగ్ చట్టాలు, ర్యాగింగ్ వల్ల వచ్చే అనర్థాలపై ఆమె అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ చేస్తే పడే శిక్షలను సవివరంగా వివరించారు.

న్యూస్‌రీల్

ఫొటో, వీడియోగ్రఫీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఫొటో, వీడియోగ్రఫీ శిక్షణకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు చెప్పారు. శిక్షణ కేంద్రంలో శనివారం వివరాలు వెల్లడించారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు, 10వ తరగతి విద్యార్హత ఉన్నవారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఆసక్తిగల వారు ఫోన్ నంబర్లు 7993340407, 9553410809 సంప్రదించాలని సూచించారు.

నేషనల్ యోగా రిఫరీగా ఈశ్వరరావు



ఈశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) యోగా అధ్యాపకులు డాక్టర్ ఈశ్వరరావు నేషనల్ యోగా రిఫరీగా ఎంపికయ్యారు. జాతీయ స్థాయి యోగా పోటీలకు రిఫరీగా వ్యవహరిస్తారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు శనివారం అందజేసి, అభినందనలు తెలియజేశారు. ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అధికారులు అభినందించారు.

కింగ్ కోబ్రా కలకలం



నెమలికొండ సాయిబులకాలనీలో హతమైన కింగ్‌కోబ్రా

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని నెమలికొండ సాయిబుల కాలనీలో శనివారం ఓ కింగ్ కోబ్రా కలకలం రేపింది. అందరూ ఇళ్లలో భోజనాలు చేసి సేద తీరుతున్న సమయంలో సర్పం జనావాసాల్లోకి రావడంతో అంతా భయభ్రాంతులకు గురయ్యారు. పది అడుగుల పామును కర్రలతో దాడి చేసి చంపేశారు.

వినాయక లడ్డూ రూ.1,40,500



డి.గొనపపుట్టుగలో అత్యధిక ధర పలికిన వినాయక లడ్డూతో చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

కవిటి: మండలంలోని డి.గొనపపుట్టుగలో వినాయక లడ్డూ రూ.1,40,500 పలికింది. శ్రీప్రతిభ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధివినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం వినాయకుని లడ్డూ వేలం నిర్వహించారు. పాటలో గొండ్యాల చంద్రశేఖర్, రమ్య దంపతులు ఈ లడ్డూను భారీ ధరకు దక్కించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అధినేత అరెస్ట్ ▸ పార్టీలో అన్ రెస్ట్

- చంద్రబాబు అరెస్టుతో సానుభూతి వస్తుందని ఆశలు
- కనీసం పట్టించుకోని ప్రజలు
- ఆందోళన, నిరసన కార్యక్రమాలకు కనిపించని మద్దతు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



ఏ ముహూర్తాన అచ్చెన్నాయుడు పార్టీ లేదు.. బొక్కా లేదు అన్నారో గానీ సరిగ్గా తెలుగుదేశం పార్టీకి అదే సంకట స్థితి తలెత్తింది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టైనా జనం కనీసం పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితిపై అచ్చెన్నాయుడు కూడా టెలీ కాన్ఫరెన్స్‌లో అసహనం వ్యక్తం చేయడం అందరూ విన్నారు. చంద్రబాబు అరెస్టైతే ప్రజల నుంచి సానుభూతి వస్తుందని, అందరూ రోడ్డెక్కి ప్రభుత్వాన్ని నిలదీస్తారని ఆశలు పెట్టుకున్న టీడీపీ అంచనాలు తలకిందులయ్యాయి. ప్రజలు రోడ్డెక్క లేదు సరికదా కనీసం సానుభూతి కూడా వ్యక్తం చేయడం లేదు. కుంభకోణాలు చేసి జైలుకెళ్లిన చంద్రబాబుకు తామెందుకు మద్దతు ఇవ్వాలన్నట్టే జనం ప్రవర్తిస్తున్నారు. దీంతో పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు జన సమీకరణ చేయడం కష్టమవుతోంది. రోజురోజుకీ నిరసన శిబిరాలు వెలవెలబోతున్నాయి. ఈ రోజు గడిచింది..రేపు ఎలా అని తలలు పట్టుకునే స్థితి నెలకొంది.

తుస్సు మంటున్నాయి..
చంద్రబాబు జైలు కెళ్లడం టీడీపీ నాయకులకు ప్రాణసంకటంగా మారింది. ఆ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు కార్యక్రమాలు నిర్వహించలేక నలిగిపోతున్నారు. బలవంతంగా కార్యకర్తలను తీసుకొచ్చి ఏ రోజుకారోజు మమ అనిపించే పరిస్థితి నెలకొంది. ఆందోళనలు చేద్దామన్నా.. నిరసన కార్యక్రమాలకు దిగుదామన్నా ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో వచ్చిన కొద్ది మందితోనే కానిచ్చేస్తున్నారు. చంద్రబాబు అరెస్టైన దగ్గరి నుంచి ఆ పార్టీ నాయకులకు చేదు అనుభవాలు ఎదురవుతూనే ఉన్నాయి. ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న కూన రవికుమార్ కొద్దోగొప్పో కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కారణంగా తన ప్రతిష్టకే భంగం కలుగుతుందన్న ఉద్దేశంతో నయానో భయానో చేసి ముందుకెళ్తున్నారు. అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో కనీస స్పందన లేదు. కళా వెంకటరావు అయితే నియోజకవర్గంలో అడ్రస్సు ఉండటం లేదు. మిగతా అన్ని చోట్ల ఆ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన నిరసన, ఆందోళన కార్యక్రమాలన్నీ తుస్సు మంటున్నాయి.

పొలిటికల్ వాచ్

విశ్వసించని జనం..
చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ప్రభుత్వంపై టీడీపీ నేతలు ఎంత దుష్ప్రచారం చేస్తున్నా ప్రజలు నమ్మడం లేదు. రాజకీయ వేధింపుల్లో భాగంగా కక్ష కట్టి చంద్రబాబును జైలుకు పంపించారని టీడీపీ నాయకులు ఎంత మొత్తుకుంటున్నా జనాలు విశ్వసించడం లేదు. తప్పు చేసినందున అరెస్టు అయ్యారని, ఆధారాల్లేకుండా అరెస్టు చేస్తే కోర్టులు ఒప్పుకుంటాయా? అని, కుంభకోణం జరిగిందని గుర్తించడం వల్లనే కోర్టులు కూడా చంద్రబాబు వేసిన పిటీషన్లు కొట్టేస్తున్నాయని, తప్పు జరగకపోతే కోర్టులెందుకు రిమాండ్‌కు పంపిస్తాయని ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. యువతకు శిక్షణ పేరుతో వందల కోట్లు దోపిడీ చేసిన చంద్రబాబుకు తగిన శాస్తి జరిగిందని అనుకుంటున్నారు. దీంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత ఉందా? జనాలకు అంతా తెలిసిపోయిందా? ఎల్లోమీడియా, సోషల్ మీడియా ద్వారా ఎంత ప్రచారం చేసినా లాభం లేదా అన్న పరిస్థితికి టీడీపీ నాయకులు వచ్చేశారు. దీన్ని కవర్ చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడం లేదు.

బోగస్ పనులతో..
చంద్రబాబుతో నేను అంటూ ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించినా ప్రజల నుంచి స్పందన రాలేదు. ఆ పార్టీ నాయకులు తప్ప ఏ ఒక్కరూ ఆ క్యాంపెయిన్‌లో పాల్గొనడం లేదు. దీంతో వాళ్లకే వాళ్లు చంద్రబాబుతో నేను కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బ్యానర్లపై సంతకాలు పెట్టుకుని సంతృప్తి చెందుతున్నారు. సెంట్రల్ జైలుకు రాసే లేఖలు కూడా బోగస్‌గానే మిగిలిపోతున్నాయి. ఆ పార్టీ నాయకులే బల్క్‌గా ఉత్తరాలు కొనుగోలు చేసి రాసి పంపిస్తున్నారే తప్ప జనాలు వ్యక్తిగతంగా చంద్రబాబుతో మేమున్నామంటూ రాసిన దాఖలాల్లేవు. ఆర్భాటం, ఖర్చు తప్ప మరేమీ మిగలడం లేదు. దీంతో ఆ పార్టీలోనే నైరాశ్యం రోజురోజుకు పెరుగుతోంది.

ప్రతికూల పరిస్థితులతో గందరగోళం..
చంద్రబాబు అరెస్టైన దగ్గరి నుంచి టీడీపీ నాయకులు చేస్తున్న ఆందోళన, నిరసన కార్యక్రమాలకు ప్రజలు హాజరు కావడం లేదన్నది అందరికీ తెలిసిందే. స్వాక్షాత్తూ అచ్చెన్నాయుడు, ఇతరత్రా నేతలంతా బాహాటంగానే చెప్పేశారు. కార్యక్రమాల్లో పాల్గొనడం పక్కన పెడితే కనీసం మాట కలిపిన సందర్భాలు కన్పించడం లేదు. చంద్రబాబుకు మద్దతిస్తున్నామనో, అండగా ఉన్నామనో ఏ ఒక్కరూ చెప్పడం లేదు. దీంతో తమ పార్టీకి ప్రజల్లో ఉన్న బలం, మద్దతు ఇంతేనా? అని, ఇంతవరకు వాపును చూసి బలుపు అనుకున్నామా.. అని వారిలో వారే చర్చించుకుంటున్న పరిస్థితి కనబడుతోంది. ఇక రూ.కోట్లు ఖర్చు పెట్టి సుప్రీంకోర్టు లాయర్లతో వాదనలు వినిపిస్తున్నప్పటికీ పసలేదని న్యాయస్థానాల్లో తేలిపోవడంతో ఆ పార్టీలో మరింత ఆందోళన మొదలైంది. లోకేష్ ఢిల్లీ వెళ్లినా ఎక్కే గడప దిగే గడపగా తయారైందే తప్ప సానుకూలత లేదని నైరాశ్యం ఆవహించింది. అన్ని రకాలుగా ప్రతికూల పరిస్థితులు కనబడటం, జనాల నుంచి స్పందన లేకపోవడంతో చంద్రబాబుకు మద్దతుగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటేనే టీడీపీ శ్రేణులు భయపడిపోతున్నాయి. పోలీసులొచ్చి అదుపులోకి తీసుకుంటే చాలు...ఈ రోజుకు అయిపోయిందనే ధోరణికి టీడీపీ కేడర్ వచ్చేసింది. ఇలాగైతే మున్ముందు కార్యక్రమాలు చేపట్టడం కష్టమేనని పార్టీ శ్రేణులు మదన పడుతున్నాయి.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్

మీరే స్ఫూర్తి.. మీదే కీర్తి



- ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే ఎవరికీ తీసిపోరని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. ఉన్నతమైన లక్ష్యం ముందు అంగ వైకల్యం ఓడిపోతుందని చెప్పారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభా వంతుల క్రీడా పోటీలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.నవీన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు మైదానం వద్దకు రావడమే వారి తొలి గెలుపని అన్నారు. తల్లిదండ్రులు కూడా వీరిని మరింత ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

జిల్లా నలుమూలల నుంచి హాజరు..
విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 147 మంది బాలబాలికలు హాజరయ్యారు. 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి క్రీడా పోటీలు జరిగాయి. నడక పోటీలు, పరుగుపందాలు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్ ప్లే, వంటి క్రీడల్లో విభిన్న ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించారు. జిల్లా విద్యా అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎన్.వెంకటరావు, జిల్లా సమగ్ర నుంచి బి.గోవిందరావు, పూడి జనార్ధనరావు, పలువురు సెక్టోరల్ అధికారులు, పీడీలు, కోచ్‌లు తదితరులు హాజరయ్యారు.



లాంగ్‌జంప్‌లో అదరహో అనిపిస్తూ..

పరుగు పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు

డిగ్రీ ఇన్‌స్టెంట్‌లో 145 మంది ఉత్తీర్ణత

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 16వ తేదీన నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షల్లో 145 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను శనివారం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ విడుదల చేశారు. డిగ్రీ ఆరో సెమిస్టర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 9 మంది ఫెయిలయ్యారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో పొందు పర్చారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మార్కుల జాబితాలు, ధ్రువీకరణ పత్రాలు, విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు డీన్ తెలిపారు.

తక్షణ ఫిర్యాదు.. ▸ భద్రంగా నగదు



- ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు 1930తో చెక్

శ్రీకాకుళం క్రైమ్:

ఆమదాలవలసకు చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ. 8.87 లక్షలు పోగొట్టుకున్నాడు.

జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద ఓ రిటైర్డు ఉద్యోగి డబ్బులు డ్రా చేసి లెక్కపెట్టుకుంటుండగా వెనుకగా నిల్చున్న యువకుడు అతన్ని ఏమార్చి కార్డును దొంగిలించి రూ. 50 వేలకు పైగా తీసేశాడు.

ఈ రెండు ఘటనలలో బాధితులు తక్షణమే అలెర్ట్ అయ్యి బ్యాంకు ప్రతినిధులకే కాక సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు డయల్ చేయడంతో కొంతలో కొంత మేర నష్టాన్ని పూడ్చుకోగలిగారు.

తక్షణ ఫిర్యాదే మార్గం..
బ్యాంకు ఖాతాలోని సొమ్మును సైబర్ నేరగాళ్లు కొట్టేస్తే ఆ సొమ్మును వెంటనే వెనక్కి రప్పించుకోవాలంటే 1930 నంబర్‌కు కాల్ చేయాల్సిందే. 24 గంటలూ ఈ నంబరు పనిచేస్తుంది. 1930 కాల్‌సెంటర్‌లో పనిచేసే సిబ్బంది అన్ని బ్యాంకులు యూపీఐ వ్యాలెట్లకు సంబంధించి ప్రతినిధులు, అధికారులను నేరుగా సంప్రదిస్తారు. బాధితుడి లావాదేవీల వివరాలన్నీ తీసుకుని ఏ బ్యాంకు ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్నాడో తెలుసుకుని ఆ బ్యాంకు నోడల్ అధికారికి సమాచారమిస్తారు. బాధితుని ఖాతాను పరిశీలించి అందులో సొమ్ము ఏ ఖాతాకు బదిలీ అయ్యిందో గుర్తించి సంబంధిత బ్యాంకు అధికారికి సమాచారమిస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకున్నారో వారి ఖాతాను సంబంధిత బ్యాంకు వారు ఫ్రీజ్ చేస్తారు. అంతే కాక బాధితుని ఖాతాలోని లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొట్టేసిన డబ్బు ఏదో ఒక బ్యాంకులో ఫ్రీజ్ అయి ఆ ఖాతా వివరాల ఆధారంగా మోసం చేసిన వారిని గుర్తించే వీలు కలుగుతుంది. ఒకవేళ అకౌంటు ఫ్రీజ్ చేసేలోగా నగదును మోసగాళ్లు విత్‌డ్రా చేస్తే నగదు బదిలీ అయిన విధానం, బ్యాంకులు ఇచ్చే సాంకేతిక ఆధారాల సాయంతో నేరస్తులను పోలీసులు పట్టుకోవడానికి సులభమవుతుందని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

సైబర్ అలర్ట్

బాధితుడు చేయాల్సింది..
- సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు డయల్ చేయాలి.
- సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్‌కు కాల్ చేసి క్రెడిట్, డెబిట్ కార్డులు, లావాదేవీలు బ్లాక్ చేయించాలి.
- పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూసుకోవాలి.
- జిల్లా సైబర్ క్రైమ్ సెల్‌కు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలి.
- బాధితుని బ్యాంకు లావాదేవీల డీటెయిల్స్, ఎఫ్ఐఆర్‌కాపీలు అన్నీ బ్యాంకువారికి సమర్పించాలి.
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలంటే హెచ్‌టీపీపీఎస్:సీవైబీఈఆర్‌సీఆర్ఐఎమ్ఈ.జీవోవీ.ఐఎస్‌కు వెళ్లాలి.

క్లుప్తంగా

తానా కవయిత్రుల సమ్మేళనానికి 'వాసవి'



కరకవలస వాసవి

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈ నెల 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్యభేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి శ్రీకాకుళం నగరానికి చెందిన కరకవలస వాసవిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తనకు విశిష్టస్థానం కల్పించిన తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ టి.ప్రసాద్, సమన్వయ కర్త చిరుగురుమళ్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఓబీసీలకు అవకాశం ఇవ్వండి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చట్టసభల్లో ఓబీసీలకు అవకాశం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో వెనుకబడిన మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జ్యోతిబాపూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రటరీ రౌతు శంకరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ చేసి బీసీ మహిళల వాటా ఎంతశాతమో తేల్చాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టి ఓబీసీల వాటా బీసీలకు ఇవ్వాలని కోరారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, బీసీలకు రూ.7లక్షల కోట్లు అభివృద్ధి నిధులు ఇవ్వాలని కోరారు. బీసీలకు క్రిమిలేయర్ తొలగించాలని కోరారు.

కొండపేటలో వైరల్ జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న చిన్నారి

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కొండపేట గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో చిన్నారులు, వృద్ధులు జ్వరం బారిన పడి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే బొంతు జంక్షన్‌లో పీహెచ్‌సీ ఉన్నప్పటికీ సిబ్బంది సరిగా విధులకు హాజరు కావడం లేదని, వైద్య సేవలు సరిగా అందించక పోవడంతో ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

లేఅవుట్ నిబంధనలపై అవగాహన



ఎస్.ఎం.పురంపేట గ్రామంలో శిక్షణలో భాగంగా లే అవుట్లు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎచ్చెర్ల క్యాంపస్: లే అవుట్ల నిబంధనలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. వారికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం ఎస్.పురం పేట గ్రామంలో లే అవుట్ల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా లేఅవుట్ ఏర్పాటులో నిబంధనలు, అనుమతులు, పాట్ల అమ్మకాలపై అవగాహన కల్పించారు. డీటీసీ పీఓ కిశోర్ కుమార్ రీసోర్సు పర్సన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం లేఅవుట్‌ల ఏర్పాటుకు సుడా అనుమతులు తప్పనిసరని చెప్పారు. 40 అడుగుల అంతర్గత రోడ్లు, రిజర్వు స్థలం కేటాయింపు, ఇతర సౌకర్యాలు తప్పనిసరని తెలిపారు. చెరువులు, గట్లు, ప్రభుత్వ స్థలాలు వంటి ఆక్రమణలు ఉండకూడదన్నారు.

కొర్లాం విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకంతో మహేష్

సోంపేట: గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న 34వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పరుగు పందెం విభాగంలో మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన రాంబుడ్డి మహేష్ బంగారు పతకం సాధించాడు. అండర్-20 కేటగిరీలో 10 కిలోమీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం గెలుచుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 5 కిలోమీటర్ల పరిధిలో పరుగు పందెంలో సిల్వర్ పతకాన్ని గెలుచుకున్నాడు. గ్రామస్తులు, తోటి స్నేహితులు మహేష్‌కు అభినందనలు తెలియజేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

సదుపాయాలు అనేకం.. సేవలు ప్రత్యేకం

- ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవితతో భరోసా
- జిల్లాలో మండలానికో భవిత కేంద్రం
- చిన్నారులకు ఉచితంగా పరికరాలు పంపిణీ
- భవిత కేంద్రాల్లో 587 మందికి, ఇంటి వద్ద 3366 మంది చిన్నారులకు సేవలు

ఆమదాలవలస రూరల్:

నిస్సహాయ చిన్నారులకు ప్రభుత్వం ఇతోధిక సాయం అందజేస్తోంది. ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవిత కేంద్రాలతో భరోసా ఇస్తోంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి వారిని సాధారణ పిల్లలు మాదిరిగా తీర్చిదిద్దుతోంది. ఇంటి వద్దనే చేసుకోవడానికి వీలయ్యే స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. వారంలో ఒక రోజు ప్రతి మండలంలో భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారులకు ప్రతి శనివారం ఇంటి వద్దకే విద్య అనే కార్యక్రమం ద్వారా వారికి ప్రత్యే పద్ధతుల్లో పాఠాలను బోధిస్తున్నారు.



పొందూరు మండల భవిత కేంద్రంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతి మండలంలో సేవలు

జిల్లాలో 30 మండలాల పరిధిలో మండలానికో భవిత కేంద్రం ఉన్నాయి. ఈ కేంద్రాల్లో వారానికి ఒక రోజు వైద్య సేవలు అందిస్తారు. జిల్లా మొత్తంగా ప్రత్యేక అవసరాల చిన్నారులు 3,953 మంది ఉన్నారు. వీరిలో 587 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు. మిగిలిన 3,366 మంది విద్యార్థుల్లో కొంత మంది ఇంటి వద్ద, మరికొంత మంది ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం 587 మంది విద్యార్థులకు ఐఈఆర్టీలు (ఇన్‌క్లూజివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ టీచర్), ఆయాలను నియమించారు. ఈ కేంద్రాలకు వారానికి ఒకసారి ఫిజియోథెరపీ ట్రైనర్ వచ్చి వ్యాయామం చేయిస్తారు. తల్లిదండ్రులకు కూడా వీటిపై అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం నడవలేని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన అంశాలను తెలియజేస్తారు.



ఆమదాలవలస మండల విద్యార్థికి వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపీ వైద్యురాలు

భవిత కేంద్రాల్లో అందుతున్న సేవలు

- మానసిక చిన్నారులకు రూ. 14 వేల విలువైన ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందిస్తారు.
- మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాసులను ఇస్తారు.
- వేల రూపాయలు విలువ చేసే హియరింగ్ మిషన్లు, మూడు చక్రాల కుర్చీలు తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు (కాలకృత్యాలు) ఎలా చూసుకోవాలో కృత్యాల (యాక్టివిటీ) ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారు. విద్యార్థులతో ఆ పనులు చేయిస్తూ క్రమంగా అలవాటు చేస్తారు. వీరికి భవిత కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఇచ్చే శిక్షణ భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.
- మానసిక దివ్యాంగులకు దృశ్యరూపక వస్తువుల ద్వారా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.
- చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాష్ కార్డు (అక్షరాల బొమ్మ) లిప్ రీడింగ్, టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తారు.
- దివ్యాంగుల్లో వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదునిస్తారు.

మార్పు కోసం కృషి



ప్రత్యేక అవసరాల చిన్నారులకు వసతులన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న ఉచిత పథకాలను గుర్తించి తెలియజేస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– బి.గోవిందరావు, సమిత విద్య సమన్వయకర్త, శ్రీకాకుళం జిల్లా

సాధారణ పిల్లలతో మెలిగేలా శిక్షణ



ప్రత్యేక అవసరాల పిల్లల మేలు కోసం భవిత కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గతంలో వీటిని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో పాటు ప్రత్యేక అవసరాల చిన్నారులు మిగతా పిల్లలతో సమానంగా మెలిగేలా శిక్షణ ఇస్తున్నారు. వారిలో వైకల్య తీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నారు. ఆటపాటలతో వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు తగు చర్యలు తీసుకోవడం ఎంతో గొప్పదిగా భావించాలి.

– డాక్టర్ గొండు సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

రొయ్యల చెరువులపై మత్స్యశాఖ డీడీ విచారణ

ఇచ్ఛాపురం రూరల్: పెద్దలక్ష్మీపురం గ్రామ రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ శ్రీనివాసరావు స్థానిక తహసీల్దార్‌తో కలసి శనివారం పెద్ద లక్ష్మీపురం గ్రామంలోని రొయ్యల చెరువులను పరిశీలించారు. రైతులు, రొయ్యల చెరువుల యాజమాన్యాలతో విడివిడిగా విచారణ చేపట్టారు. రైతుల వద్ద పంట పొలాలను కొనుగోలు చేసి దశాబ్ద కాలంగా రొయ్యల చెరువులను సాగు చేస్తున్నామని, దురుద్దేశంతో స్థానిక గ్రామస్తులు తమపై అభాండాలు వేస్తున్నారని రొయ్యల చెరువుల యాజమాన్యం తెలిపింది. అయితే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని, కాలుష్యంతో తమ పంటలు పండటం లేదని, వీటిని వెంటనే తొలగించాలంటూ రైతులు పట్టుబట్టారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఇరు వర్గాల వారికి న్యాయం చేస్తామని అధికారులు విలేకరులకు తెలిపారు.

దూడల పోషణ కీలకం

గార: దూడల పెంపకంలో పోషణే కీలకమని పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.కిశోర్ అన్నారు. జల్లువలస కూడలి వద్ద శనివారం లేగదూడల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడలకు మొదటి మూడు నెలలు తల్లిపాలు అందివ్వాలని, తద్వారా దూడ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడదూడ పుట్టే అవకాశం ఉన్న పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పాడి పరిశ్రమలో పశుగ్రాసాలు అందించడం కీలకమన్నారు. ఆరునెలల వరకు ప్రతి నెలా పొట్టపురుగుల మందు అందించాలన్నారు. సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ మాట్లాడుతూ పశువుల పెంపకంలో అధునాతన పోకడలను రైతులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి,



దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ కిశోర్

ఉప సంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథం, పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ ఎస్. మన్మథరావు, ఏడీ డాక్టర్ జీవీ రాజశేఖరం, గోపాలమిత్ర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తుపై దిశా నిర్దేశం



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ :

కేసుల దర్యాప్తులో కచ్చితత్వం పాటించాలని, విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం ఆగస్టు నెలకు సంబంధించిన కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించి ప్రమాదాలకు కారకులైన వారి లైసెన్సు రద్దు చేస్తామని, ఈ సెప్టెంబరు నెలలోనే జిల్లాలోని 29 తీవ్రమైన ప్రమాదాల కేసుల్లో 22 మంది వాహనచోదకుల లైసెన్సు రద్దు చేశామని హెచ్చరించారు. ప్రాధాన్యత కేసులపై దృష్టి సారించి రౌడీషీటర్లు, ముద్దాయిలుగా ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీటు దాఖలుపర్చాలని, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ల ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చాలన్నారు. జాతీయ రహదారిపై గల దాబాలు, షాప్స్, టైర్ పంచరింగ్ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రమాదకరమైన ప్రదేశాలను గుర్తించి నిత్యం వాహనాలను తనిఖీ చేసి స్పీడ్ బ్రేకర్లు, విజిబుల్ రంగులు వేసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ఎస్.బాలరాజు (స్పెషల్ బ్రాంచి), వై.శృతి (శ్రీకాకుళం సీడీపీవో), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వరరెడ్డి (కాశీబుగ్గ), డైరెక్టర్ ఆఫ్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.మల్లేశ్వరరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.తిరుమలరావు, కె.శంకరరావు, శ్రీకాంత్, సీనియర్ ఏపీపీలు నాగభూషణం, సుశీల, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'ప్రజలకు మెరుగైన సేవలందించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ అధికారులు ప్రజా సేవకులని, వారంతా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తామని, సమస్య లేకుంటే ఆ కేసును ముగించడం జరుగుతుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎలాంటి కేసులనైనా కేవలం రెండు నెలల్లో పరిష్కరిస్తారని వివరించారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణం సంస్థ, మెప్మా, డ్వామా పథక సంచాలకులు నక్క గణపతి, కిరణ్ కుమార్, చిట్టి రాజు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతినిధి, సంబంధిత శాఖల అధికార ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు

'లక్ష్యం గొప్పదిగా ఉండాలి'



మక్కవల్లి లక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల లక్ష్యం గొప్పదిగా ఉండాలని కాలిఫోర్నియాకు చెందిన ఐటీ రంగ అంతర్జాతీయ సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విమెన్ నెట్‌వర్క్ చైర్ పర్సన్, ఆంధ్రప్రదేశ్ ఐటీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముక్కవల్లి లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని మునసబుపేటలో గల గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అపజయాల నుంచి పాఠం నేర్చుకోవాలని, నిరాశ, నిస్పృహ వంటి వాటి వల్ల సమయం కోల్పోతామన్నారు. విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు మాట్లాడుతూ గొప్ప వ్యక్తులు చెప్పే మాటలు విని ప్రేరణ పొందాలన్నారు. కాలేజీ ప్లేస్‌మెంట్స్‌లో విప్రో, ఇన్ఫోసిస్, వంటి ఎంఎన్‌సిల్లో ఉద్యోగం పొందిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కరస్పాండెంట్ రంగారావు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, ఐక్యూ సమన్వయకర్త మార్తాండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



కారు ముందు భాగంలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ జరిగి ఓ కారు దగ్ధమైంది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎం.వరప్రసాదరావు, కారు యజమాని తెలిపిన వివరాల మేరకు.. శరత్ చంద్ర అనే వ్యక్తి శ్రీకాకుళంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో తన పెద నాన్న కార్యానికి హాజరు కావడం కోసం భువనేశ్వర్ నుంచి డస్టర్-2013 మోడల్ కారుపై బయల్దేరారు. కారు డే అండ్ నైట్ కూడలికి చేరుకోగానే క్లచ్ పనిచేయడం మానేసింది. వెంటనే మెకానిక్‌ను తీసుకువద్దామని దిగి వెళ్తుండగా కారులో ఒక్కసారిగా పొగతో కూడిన మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వాటర్ ఇంజిన్‌తో ఎల్‌ఎఫ్‌ఓ దుర్గారెడ్డి, డీఓపీ చిన్నంనాయుడు, ఫైర్‌మాన్ పాపారావులతో కూడిన బృందం చేరుకుని మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇంజిన్ మొత్తం డ్యామేజీ అవ్వడం, టైర్లు, ఏసీ, బోనెట్, ఫ్రంట్ సీట్ కాలిపోయి డోర్ లాక్ అయ్యింది. ప్రమాద సమయంలో కారులోపల ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రూ. 4 లక్షల వరకు నష్టం అంచనా వేసినట్లు ఏడీఎఫ్‌ఓ వరప్రసాద్ చెప్పారు.

'నూతన విద్యా విధానంతో మంచి ఫలితాలు'



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యా విధానం అమలుతో భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. దేశంలో నూతన విద్యా విధానం- 2020 అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ ముందు వరుసలో ఉందని చెప్పారు.

విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో నూతన విద్యావిధానం వల్ల విద్యా విధానంలో మార్పులు, ప్రయోజనాలపై విద్యా విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నూతన విద్యా విధానం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుందని, నైపుణ్య విద్యకు ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పా రు. నాలుగేళ్ల సమీకృత డిగ్రీలు, ఆనర్స్ డిగ్రీ, స్పెషలైజేషన్ సబ్జెక్టు డిగ్రీలు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రస్తుత అవసరాలను అనుగుణంగా సిలబస్‌లో మార్పులు వంటివి చోటు చేసుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి నైపుణ్య విద్య అందుతుందని చెప్పారు. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత అన్ని విద్యలు బలోపేతం అవుతాయని తెలిపారు. 2025 ఏడాది నాటికి విద్యలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పన, బోధన సిబ్బంది నియామకం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.